
# ఈ వారం కథ




**ఆమె మనసేమిటో గ్రహించాను. సమాజానికి భయపడ్తోంది. తనని కన్నవాళ్ళకీ తను కన్నవాళ్ళకీ భయపడ్తోంది. కోరికల్ని వ్యక్తపరచడానికీ, వ్యక్తి స్వేచ్ఛని ప్రకటించడానికీ భయపడ్తోంది. చీకటికి అలవాటుపడిపోయి వెలుతురు చూడటానికి భయపడ్తోంది. భయాన్ని పదార్థీకరించి తయారుచేసిన బొమ్మ తను.**

**-సాహితి**

చాలాకాలం తర్వాత ఈ వూరొచ్చాను. ఈ ఊరంటే... నేను పుట్టి పెరిగిన ఊరు... డబుల్ ఎమ్మే చదివి కూడా జాబ్ దొరక్క... ఖాళీగా వుండలేక ప్రైవేట్ స్కూల్స్ చుట్టూ తిరిగిన ఊరు... దాదాపు పదేళ్ళైంది ఈ ఊరితో ఆఖరి అనుబంధం తెగిపోయి. ముఖ్యంగా సుమతితో...

పదేళ్ళలో ఊరేం మారలేదు. అదే గతుకుల రోడ్డు, స్టేజీమీద ఆగని బస్సులు, ఎక్కడ ఎప్పుడాగుతాయో తెలీని ఆటోలు, బస్తాల్లాంటి బేగ్‌లు మోస్తూ బడిపిల్లలు... యథాతథంగానే ఉంది.

మెయిన్ రోడ్డు మీద నడుస్తున్నాను. సుమతి పదేపదే గుర్తొస్తోంది.

'మిరపకాయ బజ్జీలు తినాలని ఎప్పట్నించో అనిపిస్తోంది మూర్తీ!' అనేసి-

నేను తీసుకొస్తాననగానే, 'అమ్మో! వద్ద. ఈ రోడ్డు మీదా? ఎవరేనాచూస్తే బావోదు' అని మాట దాటేసి, అంత చిన్న కోరికని కూడా మనస్థాపితం చేసేసే కదిలే నిర్జీవ ప్రతిమలాంటి సుమతి గుర్తొచ్చాక తనని చూడకుండా వుండటం నాకు సాధ్యపడలేదు.

అడుగులు ముందుకి సాగుతుంటే మనసు వెనక్కి జరుగుతూ భూత భవిష్యత్కాలాలని అనుసంధానిస్తోంది.

★ ★ ★

ప్రగతీ స్కూల్లో నాకు సుమతి పరిచయమ్మైంది. సన్నటి దేహం, బెరుగ్గా చూసే కళ్ళూ ముందు చూశాక ఆ తర్వాత పల్చటి పమిటిలోంచీ మెరుస్తున్న మంగళసూత్రాల్నీ, పచ్చటి పాదాల ముందు వెలవెలబోతున్న మట్టెల్నీ చూశాను. మొదటి రోజునే ఆమెని చాలా స్టడీ చేశాను. ఎవరితోటీ మాట్లాడదు. తనలోకి తను కుదించుకుపోతూ ఉంటుంది. ఏదో తప్పు చేసినట్టో ఎవరికో జవాబుదారీ అన్నట్టో వుంది ఆమె ప్రవర్తన. గమ్మత్తనిపించింది.

ఆకర్షణ దీపశిఖ లాంటిది. మనిషిని తనవేపుకి లాక్కుంటుంది. అందులో ఉచితానుచితాలకి గానీ సాధ్యాసాధ్యాలకిగానీ చింతనకి చోటుండదు. అలాంటి ఆకర్షణ నాకు కలిగింది - సుమతిపట్ల.

క్రమంగా ఆమె గురించి నాకు కొన్ని విషయాలు తెలిసాయి. భర్త వదిలిపెట్టేశాడట. ఇద్దరు పిల్లలు. అలాంటి స్త్రీ పట్ల ప్రేమేమిటని అనిపించచ్చు. కానీ మనసు నిర్మలంగా వుంటే శారీరకమైన మార్పులు ప్రేమకి ఆటంకం కావు. సుమతి మనసులోని నైర్మల్యం ఆమె మొహంలో ప్రతిబింబించేది.

'ఎందుకొదిలేశాడతను?' కొంత పరిచయం పెరిగాక అడిగాను. ఆమె దెబ్బతిన్నట్టు చూసింది. నేనంత సూటిగా అడుగుతానని ఊహించి ఉండకపోవచ్చు. లేదా తన ప్రైవసీని ఛేదిస్తున్నా ననిపించవచ్చు. వెంటనే నాకు జవాబివ్వలేదు. రెండు రోజులు నన్ను తప్పించుకు తిరిగింది.

ఇంతలోకే మరో టీచర్ కల్పనతో స్టాఫ్ రూమ్‌లో గొడవ పడ్డాను. సుమతి గురించ - తనక్కడలేదు.

'మొగుడొదిలేశాడు...' వెక్కిరింపుగా ఎవర్తోటో చెప్తోందామె. సుమతి గురించి. అక్కడ లేని మనిషి గురించి వెనక చెప్పుకోవడం... అదీ చెడ్డగా... ఏం కల్చరది? వీళ్ళేం టీచర్లు? పిల్లలకి వీళ్ళేం పాఠాలు చెప్పగలరు?

'ఆమెని మొగుడొదిలేస్తే అతన్ని వెక్కిరించండి. అంతే గానీ ఆమెనెందుకలా అంటారు?' చిరాగ్గా అడిగాను.

'ఆడవాళ్ళం ఏదో మాట్లాడుకుంటాం. మీకేంటి అంత ఇంట్రెస్టు?' కల్పన కోపంగా అడిగింది.

'ఆమె తప్పేమీ లేకుండానే వదిలేశాడా?' అంది మరో టీచర్.

'మీరామె తరఫున వకాల్తా తీసుకున్నారా?' అని ఆమెకి వత్తాసు పలుకుతూ ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్.

చిలికిచిలికి గాలివానైంది.

'వాళ్ళతో మీకెందుకు గొడవ?' సుమతి నన్నే కోప్పడింది.

'నీ వెనక వాళ్ళలా మాట్లాడచ్చునా?' విసురుగా అడిగాను.

'నువ్వా అడిగావుగా, ఆయనెందుకు వదిలేశాడని?'

'అదీ ఇదీ ఒకటేనా?' దెబ్బతిన్నట్టు అన్నాను. 'నీ ప్రాబ్లమ్ ఏమిటో తెలుసుకోవాలని అడిగాను. అంతేగానీ నిన్ను కించపరచాలని కాదు' కోపంగా జవాబిచ్చాను.

'తెలుసుకుని ఏం చేస్తావ్?'

'పరిష్కారం కోసం వెతుకుతాను'

తను నవ్వింది. 'ఆ పని నేను చెయ్యలేదనా? ఇప్పుడింక ఆ ఆశ కూడా లేదు. అన్ని దారులూ మూసుకుపోయాయి. మిగిలిందల్లా పిల్లలకి నేనూ, నాకు వాళ్ళూ. అంతే' అంది.

పెళ్ళప్పుడు సుమతికి కట్నం డబ్బుల్లో పదివేలు తక్కువ పడిందట. తండ్రి మగపెళ్ళివారి కాళ్ళావేళ్ళాపడి ఎలాగో పెళ్ళైందనిపించి, కూతుర్ని అంపకం పెట్టాడట. అప్పట్నుంచీ సాధింపులతో మూడేళ్ళు గడిచాయట.

'అతనికి మరో అమ్మాయితో పరిచయమ్మైంది మూర్తీ. పెళ్ళనే పడవలో ఇద్దరికే చోటుంటుందిగా! కాబట్టి నన్ను నడిసంద్రంలో తోసేశాడు' నిర్లిప్తంగా చెప్పింది.

నేను చాలాసేపు మాట్లాడలేకపోయాను.

'విడాకులివ్వకుండానేనా?' అడిగాను.

'అదొక్కటే అదృష్టం... ఈపాటేనా పరువుగా బతుకుతున్నాను'

'అతనొదిలేస్తే పోని పరువు డైవోర్సిస్తే పోతుందా?' షార్ప్‌గా అడిగాను.

'ఎందుకులే మూర్తీ! అదో గొడవ... నలుగురిలో అల్లరి. కోర్టు చుట్టూ తిరగాలి. అతనే వద్దనుకున్నాక... ఇదంతా ఎందుకు?' అనేసింది.

మెయింటెనెన్స్ మాట తననలేదు. అభిమానం గలదే! కానీ మూడొందల రూపాయల జీతంతో ఇద్దరు పిల్లల్తో ఎలా నెట్టుకొస్తోందో నా కర్థం కాలేదు. నాకే కాదు, ఇండియాకి ఎకనామిక్స్‌లో నోబుల్ ప్రైజు తెచ్చిపెట్టిన అమర్త్యసేన్‌కి కూడా అర్థమవదేమో తన ఆర్థిక సూత్రం. కొన్నాళ్ళు పుట్టింట్లో వుందట. తమ్ముడూ మరదలూ చేసిన గొడవకి అక్కణ్ణించీ వచ్చేసి విడిగా వుంటోందట.

'ఆడపిల్ల గుండెల మీద కుంపటి. ఒకసారి దాన్ని దింపుకున్నాక మళ్ళీ దాన్నెవరూ ఎత్తుకోరు' నిర్లిప్తంగా అంది సుమతి - సమాజానికీ, కన్నవాళ్ళకీ కూడా స్త్రీపట్ల వున్న దృక్పథాన్ని ఒక్క మాటలో వ్యక్తపరుస్తూ.

నాకు బాధ కలిగింది - తనలా నిరాదరణకి గురౌతున్నందుకు కాదు, అంతగా నిరాదరిస్తున్నా ఆమెలో తిరగబడే మనస్తత్వం తలెత్తనందుకు.

★ ★ ★

మొదట్లో ఆకర్షణే ప్రేమగా పరిభ్రమింపజేస్తుంది. తరువాత క్రమంగా ప్రేమగా రూపొందుతుంది. రెండో స్టేజి చేరుకున్నాను నేను.

'మనం పెళ్ళి చేసుకుందాం' అన్నాను.

సుమతి తెల్లబోయింది. 'నువ్వు... నువ్వేమంటున్నావు?' దిగ్భ్రాంతితో తనకి మాటలు తడబడ్డాయి.

'నిజంగానే అంటున్నాను. అంత ఆశ్చర్యానికేముంది? డైవోర్స్ కప్లై చెయ్యి'

'నాకు... నాకలాంటి ఉద్దేశం ఎప్పుడూ లేదు. నువ్వేదో ఫ్రెండ్లీగా వస్తున్నా వనుకున్నాను. ఇప్పటికే నలుగురూ నాలుగు విధాలుగా అనుకుంటున్నారు. ఇదివరకూ నా వెనక హేళన చేసేవారు. ఇప్పుడంతా మొహమ్మీదే అంటున్నారు మూర్తీ. ప్లీజ్! నా జోలికి రాకు. నన్నిలా వదిలెయ్' అంది పాలిపోయిన మొహంతో... వణుకుతున్న గొంతుతో.

'ఎందుకంత భయపడటం? ఎవరికి భయపడటం? తప్పుచేస్తే భయపడాలి. అది కూడా ఎవరికి? మనం తప్పుచేసేలా పరిస్థితుల్ని సృష్టించిన మనుషులకి కాదు, మన అంతరాత్మకి. మనం పెళ్ళిచేసుకుందాం. ఈపాటి ఉద్యోగాలు ఇంకోచోట దొరక్కపోవు. అదీగాక నేను చాలా కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాశాను. ఏదో ఒకటి తగలకపోదు. హాయిగా బతకచ్చు' నచ్చజెప్తున్నట్టుగా అన్నాను.

'నీకు తెలీదు. సమాజం మనని బతకనివ్వదు' తల అడ్డంగా ఊపుతూ అంది. తను చాలా ఎమోషనల్‌గా ఉంది. ముఖ్యంగా భయపడ్తోంది. తనకి జీవితాన్ని పునర్నిర్మించుకోవాలనే కోరిక వుందో లేదో నాకు అర్థం కావటంలేదు.

మా అక్కయ్యుంది. బావగారు తననసలు లక్ష్యపెట్టరని బాధపడ్తుంది. అమ్మకీ నాకూ చెప్పుకుని ఏడుస్తుంది.

'ఒక్క పదిరోజులు ఆయన్నీ పిల్లల్నీ అక్కడి బాదరబందీలు వదిలేసి వచ్చి ఇక్కడుండిపోవే. నీ విలువేంటో ఆయనకి తెలిసొస్తుంది' అంటాను నేను.

'అలా ఎలా కుదుర్తుందిరా? నేను లేకపోతే ఒక్క నిముషం కూడా కదల్దక్కడ' అనేసి తిరుగు ప్రయాణం హడావిడిలో పడిపోతుంది.

మా చిన్నాన్న కూతురు - భర్త స్థిరుడు కాదు. ఉద్యోగం సద్యోగం లేకుండా రికామీగ తిరుగుతూ భార్య సంపాదన మీద బతికేస్తుంటాడు. వారమేసి రోజులు ఊరొదిలేసి వెళ్ళిపోతుంటాడు. నాన్నా, చిన్నాన్నా వంతులవారీగా వెళ్ళి వాళ్ళ కాపురాన్ని సరిచేసి వస్తుంటారు.

'అలాంటి వాడికి భార్యగా ముద్ర వేసుకుని, అతనికి పిల్లల్ని కంటూ అక్కర్లేని గుదిబండల్ని మెడకి తగిలించుకోవడమేమిటే? విడాకులిచ్చి పారేసి, ఇంకో పెళ్ళి చేసుకోకూడదూ? బతుకంతా ఏడుస్తూ గడపడం దేనికి?' అంటాను నేను.

'పోరా! నీ కబుర్లూ నువ్వూను' అని తడికళ్ళతో నవ్వేస్తుంది.

వీళ్ళకి సమస్యలుంటాయి. వాటికి పరిష్కారాలూ ఉంటాయి. కానీ శాశ్వతమైన పరిష్కారాలక్కర్లేదు. తాత్కాలికంగా ఎవరేనా ఓ పిసరు సానుభూతి చూపిస్తే దాన్ని ఆసరా చేసుకుని గడ్డి పరక పట్టుకుని గోదావరి ఈదినట్టు జీవనసాగరం ఈదేద్దామనుకుంటాను. ఈ పరంపరలో నాకు తారసపడిన మూడోవ్యక్తి సుమతి.

నన్ను పెళ్ళి చేసుకోనని చెప్పేసింది.

నాకు కోపం రాలేదు. జాలేసింది. 'అతను మారతాడనీ మళ్ళీ నిన్ను వెతుక్కుంటూ వస్తాడనీ నమ్మకం ఉందా?' అడిగాను.

'లేదు'

నేనింకేమీ అడగలేదు. ఆమె మనసేమిటో గ్రహించాను. సమాజానికి భయపడ్తోంది. తనని కన్నవాళ్ళకీ తను కన్నవాళ్ళకీ భయపడ్తోంది. కోరికల్ని వ్యక్తపరచడానికీ, వ్యక్తి స్వేచ్ఛని ప్రకటించడానికీ భయపడ్తోంది. చీకటికి అలవాటుపడిపోయి వెలుతురు చూడటానికి భయపడ్తోంది. భయాన్ని పదార్థీకరించి తయారుచేసిన బొమ్మ తను.

ఉద్యోగం వదిలేసి తనకి దూరంగా వచ్చేశాను. వెంటనే గవర్నమెంటు జాబొచ్చి వేరే ఊరు వెళ్ళిపోయాను. తర్వాత ఇదే రావటం. రిటైరయ్యాక నాన్నా, అమ్మ మా స్వగ్రామం వెళ్ళిపోవటంతో ఈ ఊరికి మళ్ళీ రావాల్సిన అవసరం కలగలేదు.

★ ★ ★

పదేళ్ళ క్రితం ఏ ఇంట్లో వుండేదో అదే ఇంట్లో ఉంది సుమతి. వాకిట్లోనే సుమతి పెద్దకొడుకు ఎదురయ్యాడు.

నన్ను చూసి సుమతి చాలా ఆశ్చర్యపోయింది. 'నేనింకా గుర్తున్నానా?' అనడిగింది.

ఈ పదేళ్ళలో తను మరింత శుష్కించింది. తలలో వెండి తీగలు మెరుస్తున్నాయి. సూత్రాల గొలుసు లేదు. పసుపు తాడుకి గుచ్చుకుని వేసుకుంది. చేతులకి మట్టి గాజులున్నాయి. నాకు భోరుమని ఏడవాలనిపించింది. ఎవరి కోసం ఇదంతా? ఏ సంస్కృతిని నిలబెట్టాలని? ఏ పురుషాభిజాత్యానికి ఇంకాస్త ఆజ్యం పోయాలని?

'అక్కడే చేస్తున్నావా?' అడిగాను.

'లేదు. జీతం ఎక్కువివ్వాల్సొస్తుందని ఆ స్కూల్లోంచీ తీసేశారు. తర్వాత చాలా స్కూళ్ళు మారాను. ట్రెయిన్డ్ పర్సన్ని కాదుకదా?' అంది.

'పిల్లలేం చదువుతున్నారు?'

'పెద్దాడు సెవెన్త్, చిన్నాడు సిక్స్త్' చెప్పి, 'పెళ్ళైందా?' అనడిగింది. అడుగుతున్నప్పుడు తన గొంతులో వినీ విన్పించనట్టు సన్నగా వొణుకు.

'అయింది' పొడిగా అన్నాను.

'పిల్లలా?'

'ఇద్దరు. బాబు, పాప. ఫస్ట్‌క్లాస్. నర్సరీ చదువుతున్నారు'

'అందరూ కలసి రావాల్సింది' తన మాటల్లో నా భార్యని చూడాలనే కోరిక వ్యక్తమైంది. ఆమె గురించి తెలుసుకోవాలనే తపన కనిపించింది. అది నేను గుర్తించానేమోనని వెంటనే సర్దుకుని 'ఐనా ఎవరింటికని తీసుకొస్తావులే? మనకి బంధుత్వాలు లేవుగా?' అంది.

'స్నేహితురాలి ఇంటికని తీసుకొస్తాను. తనకి మెదడూ దాంతోపాటు తెలివీ వున్నాయి. అర్థం చేసుకుంటుంది. అపార్థం చేసుకోదు' అన్నాను.

'నువ్వేం మారలేదు'

'ఎందుకు మారాలి?'

'నామీద కోపం పోనట్టుంది?'

'నీ మీద నాకెందుకు సుమతీ కోపం? ప్రవాహంలో కొట్టుకు పోతున్నవాడికి చెయ్యందిస్తాం. అందుకోకపోతే వాడి కర్మని వదిలేస్తాం'

నాకు టీ తీసుకొచ్చి ఇచ్చే నెపం మీద తను అ[illegible]ణ్ణుంచీ లోపలికి వెళ్ళింది. టీ తాగుతుంటే తన [illegible]యాలు చెప్పింది. భర్త మళ్ళీ తిరిగి చూడలేదుట. తల్లీ దండ్రీ చనిపోయారుట.

'పిల్లల్ని నాతో పంపించు. కొన్నాళ్ళు మా ఇంట్లో ఉండి చదువుకుంటారు. నువ్వు కూడా అక్కడికొచ్చేయ్. ఏదైనా జాబ్ చూస్తాను' అన్నాను. తను నాకేమీ కాదనుకోలేక పోతున్నాను.

'నీ భార్యేమీ అనుకోదా?'

'తన గురించి చెప్పానుగా? నా బలహీనతల్నీ కోరికల్నీ తను మన్నించగలదు'

'కానీ... ఎలా కుదుర్తుంది మూర్తీ? నలుగురూ ఏమనుకుంటారు? పెరిగి పెద్దయ్యాక పిల్లలు నన్ను నిలదియ్యరా?'

ఈసారి నాకు కోపం వచ్చింది. మూర్ఖత్వంతో తన బతుకు పాడుచేసుకుంది. ఎడారిలో పాంథుడిలా బతుకుతోంది. ప్రేమాప్యాయతల కోసం అల్లల్లాడిపోయి, అవి దొరక్క దారి తప్పుతున్న పిల్లల్ని కూడా అదే ఎడారిలోకి లాక్కెళ్తోంది.

లేచి నిలబడ్డాను. 'దేవుడు మనిషిని సృష్టిస్తా[illegible] సుమతీ! మనిషి జీవితాన్ని సృష్టించుకుంటాడు. నీ [illegible]తాన్ని ఒక వంకర గీతలా సృష్టించారు నీ తల్లిదండ్రులు. ఆడపిల్లననే ఆత్మన్యూనత, నలుగురికీ భయపడుతూ బతకాలనే ఆత్మవంచన రంగరించి నీ వ్యక్తిత్వాన్ని క్రిపుల్ చేశారు.

దానికి తోడు నీ జీవితంలో తటస్థపడ్డ సంఘటనలు నీలో సెల్ఫ్‌పిటీని పెంచాయి. అయాం టెర్రిబ్లీ సారీ! నిన్ను మార్చడంగానీ... నీకు సాయం చెయ్యటంగానీ నా వల్లకాదు. మర్చిపోవడానికి ప్రయత్నిస్తాను. కనీసం అదేనా నేను చెయ్యగలననుకుంటాను. గుడ్‌బై ఫరెవర్' అనేసి వచ్చేశాను.

ఈ ఊరితో నా ఆఖరి అనుబంధాన్ని పదేళ్ళ క్రితం నేను తెంపుకున్నది భౌతికంగా. ఇప్పుడింక మానసికంగా కూడా.

★